సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 9 । ఏప్రిల్ । 2025




కల్యాణం.. రమణీయం
ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది.



ప్రతి రైతు పారిశ్రామిక వేత్తగా ఎదగాలి
ప్రతి రైతూ పారిశ్రామికవేత్తగా ఎదగాలని జాతీయ వాణిజ్య పరిశోధన, వ్యవసాయ పరిశోధన సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు.

8 లో


8,900 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 5 వేలు క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులు ఉంది.

గుదిబండ..

- డొమెస్టిక్ సిలిండర్ ధరకు రెక్కలు
- రూ.50 పెంచిన కూటమి ప్రభుత్వం
- ప్రజలపై అదనపు భారం
- జిల్లాలోని 91 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 6.57 లక్షల కనెక్షన్లు



జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు

హెచ్‌పీ	44
ఇండేన్	33
భారత్	14
మొత్తం	91

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు

జనరల్	4,05,782
దీపం	1,84,183
ఉజ్వల	57,420
సీఎస్ఆర్	9,872
5 కేజీలు	195
మొత్తం	6,57,452

ఆలమూరు: కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల రూపంలో పెనుభారం మోపుతూ కాలకూట విషం చిమ్ముతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్రోలు ధరలు తగ్గించి రాష్ట్ర ప్రజలకు ఉపశమనాన్ని అందిస్తానన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సరికదా సగటు జీవిని మోసగిస్తూ అన్ని ధరలను పెంచుకుంటూ పోతోంది. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలతో బెంబేలెత్తిపోతున్న జిల్లా వాసులకు గ్యాస్ ధరల పెంపుతో మరో షాక్ తగిలింది. గతేడాది కంటే ఈ ఏడాదిలో అన్ని వస్తువుల ధరలను డబుల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. డబుల్ ఇంజిన్ సర్కారుగా పేరును నిలబెట్టుకుంది.

జిల్లాలో 6,57,452 గ్యాస్ కనెక్షన్లు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో 91 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 6,57,452 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు 57,420 వరకూ ఉన్నాయి. వాటన్నింటిపైనా రూ.50 పెంపు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించింది. జిల్లాలో నిత్యం ఆయా గ్యాస్ ఏజెన్సీల ద్వారా రోజుకు సుమారు 15 వేల డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నారు.

అదనపు భారం

జిల్లాలో ఈ నెల ఏడో తేదీ వరకూ 14.20 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.833గా ఉంది. వంట గ్యాస్‌పై మంగళవారం నుంచి పెరిగిన ధరల భారంతో అది రూ.883కి చేరింది. జిల్లాలో సగటున ఒక్కో కుటుంబం ఏడాదికి ఏడు సిలిండర్లు చొప్పున 48.58 లక్షల డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. వంట గ్యాస్ కోసం ఇప్పటి వరకు ఏడాదికి సుమారు రూ.5,849 వెచ్చిస్తే, ప్రస్తుత ధర ప్రకారం రూ.6,196లు చెల్లించాలని గణాంకాలు తెలియజేస్తున్నాయి. పెరిగిన ధరతో జిల్లా వాసులపై నెలకు రూ.3.338 కోట్ల మేర అదనపు భారం పడుతోంది. జిల్లాలో రూ.310 రాయితీపై అందిస్తున్న 57,420 గ్యాస్ కనెక్షన్ల పైనా ధరల భారం మోపడం పేదలకు ద్రోహం చేయడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్యాస్ రాయితీ కొందరికే!

రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే పథకం కూడా కొందరికే వర్తింపజేస్తోంది. దీపావళి కానుకగా గత ఏడాది నవంబర్‌లో ఉచిత సిలిండర్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో భాగంగా జిల్లాలోని 6.57 లక్షల గ్యాస్ కనెక్షన్ల వినియోగదారులకు 5.43 లక్షల మంది ఎంపికయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి కేవలం 3.79 లక్షల మందికే రాయితీని అందించింది. మిగతా లబ్ధిదారులు ఇదేమిటని ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పేవారే కరువయ్యారు.



ఆత్రేయపురం మండలం ర్యాలిలో గృహాలకు సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్లు

ధరల మోత
కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి, ప్రజలపై ఎనలేని పన్నుల భారం మోపుతోంది. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ చార్జీలను ట్రాన్స్‌కో రెట్టింపు వసూలు చేస్తోంది. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో మార్కెట్‌లో రోజు రోజుకు పెరిగిపోతున్న అనేక రకాల వస్తువుల ధరలు షాక్ కొడుతుంటే, వంట నూనెల రేట్లు సలసలా కాగుతున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. మహిళలు నిత్యం వినియోగించే వంటగ్యాస్ ధరలను ఏకపక్షంగా పెంచడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను వినియోగదారుడిపై కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించి ప్రభుత్వానికి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుకోవాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

మహిళలను దగా చేసిన కూటమి



అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలను పెంచబోమని గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. నిత్యం మహిళలు ఇంట్లో ఉపయోగించుకునే వంటగ్యాస్ ధర పెంచడం సరికాదు. పెంచిన వంటగ్యాస్ ధరలను సత్వరమే ఉపసంహరించుకోవాలి.

– తోరాటి సీతామహాలక్ష్మి, జెడ్పీటీసీ, ఆలమూరు, కోనసీమ జిల్లా

గ్యాస్ సిలిండర్ ధర పెంపు సరికాదు



నిత్యావసరాల్లో ఒకటైన గ్యాస్ సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచడం సరికాదు, ఇప్పటికే అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయి, అల్లాడిపోతున్న పేదలు ఇప్పుడు మరింత కలవరపడుతున్నారు. దీనిపై ప్రభుత్వాలు పునరాలోచన చేయాలి.

– సలాది సూర్యావతి, గృహిణి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం, కోనసీమ జిల్లా

గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు దారుణం
ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆవేదన

అమలాపురం టౌన్: గ్యాస్ సిలిండర్‌పై ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఒకేసారి రూ.50 పెంచేసి, మహిళలపై మోయలేని భారం మోపిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రూ.50 పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా కేజీ బేసిన్‌లోని వ్యవసాయ భూములను పలు చమురు సంస్థలు సర్వేలు, అన్వేషణలు, కార్యకలాపాల పేరుతో నాశనం చేస్తున్నాయన్నారు. ఇక్కడి నుంచి సహజ వాయువు, చమురును తోడేసుకుంటూ రూ.కోట్లు ఆర్జిస్తున్నా ఇక్కడి మహిళలకు మాత్రం వంట గ్యాస్ ధరల కష్టాలు తప్పడం లేదన్నారు. ఏపీ పెట్రోలియం కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు గ్యాస్ బండ ధరలను విచ్చలవిడిగా పెంచేస్తున్నారని ఆరోపించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇంటింటికి వంట గ్యాస్‌ను పైపులైన్ల ద్వారా అందిస్తామని 15 ఏళ్ల కిందటే ఎన్‌డీఏ ప్రభుత్వం చెప్పి మోసం చేసిందన్నారు. కేజీ బేసిన్‌లో పలు చోట్ల నుంచి గ్యాస్ ఉత్పత్తి, ఎగుమతి అవుతున్నా మహిళలకు ఇంటింటికీ గ్యాస్ అందించే ప్రాజెక్ట్ మాత్రం ఎందుకు మరుగున పడిపోయిందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్, బాబీ గాబ్రియేల్, గుత్తుల సుబ్రహ్మణ్యం తదితరులు గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని ఖండించారు.

నేడు రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్
కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో తలాష్ – 2కె 25 పేరిట రాష్ట్రస్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను బుధవారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ తెలియజేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నన్నయ్య యూనివర్శిటీ వీసీ ప్రసన్న శ్రీ, ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్ హాజరవుతారన్నారు.

న్యూస్‌రీల్

స్పెషల్ అసిస్టెంట్లకు డీఏ కల్పించాలి



ఎమ్మెల్సీ గోపిమూర్తికి వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల ముల్యాంకనం విధులు నిర్వర్తిస్తున్న స్పెషల్ అసిస్టెంట్లకు డీఏ కల్పించాలని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ (పీఈటీ) సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఉభయ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తికి వినతిపత్రం అందించారు. స్థానిక జిల్లా పరిషత్ స్కూల్లో జరుగుతున్న పదో తరగతి జవాబు పత్రాల ముల్యాంకన కేంద్రం వద్ద ఎమ్మెల్సీని సంఘ ప్రతినిధులు కలిసి డీఏ కల్పనపై చర్చించారు. సుదూర ప్రాంతాల నుంచి స్పెషల్ అసిస్టెంట్లను ఈ విధులకు నియమించినప్పటికీ ఎలాంటి టీఏ, డీఏలు చెల్లించడం లేదన్నారు. అసంబద్ధమైన ఈ విషయాన్ని రాష్ట్ర ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్ దృష్టికి తీసుకుని వెళ్లాలన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో జిల్లా వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చొల్లంగి ప్రసాద్, బొంతు వీవీఎస్ఎన్ మూర్తి, అమలాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు వైఎస్‌వీ రమణారావు, తోట రవి, పి.గన్నవరం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు పాయసం శ్రీనివాస్, ముత్యాల కిషోర్ ఉన్నారు.

సృజనాత్మకతను వెలికితీసే అటల్ ల్యాబ్స్



పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు వెంకటేష్

అమలాపురం రూరల్: విద్యార్థులలో దాగిన సృజనాత్మకతను వెలికి తీసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ దోహదం చేస్తాయని అటల్ ల్యాబ్స్ రాష్ట్ర సమన్వయ అధికారి పి.వెంకటేష్ తెలిపారు. అమలాపురం మండల పరిధిలోని పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ ల్యాబ్‌ను మంగళవారం డీఈవో షేక్ సలీం బాషాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పేరూరు పాఠశాల అటల్ ల్యాబ్ కేంద్రంగా ఉందని, దీని పరిధిలో 5 అటల్ స్పోక్ స్కూల్స్, 41 జనరల్ అటల్ ల్యాబ్ స్కూల్స్ పనిచేస్తున్నాయన్నారు. ల్యాబ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా మాట్లాడుతూ త్వరలో 26 పీఎంశ్రీ స్కూళ్లలో అటల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి నెలా నివేదికను జిల్లా కేంద్ర కార్యాలయానికి సమర్పించాలన్నారు. డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు పాల్గొన్నారు.

12న అమలాపురంలో జాబ్ మేళా
అమలాపురం రూరల్: జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 12వ తేదీ ఉదయం 10 గంటలకు అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జాబ్‌మేళా పోస్టర్లు, మాండేటరీ రిజిస్ట్రేషన్ క్యూఆర్ కోడ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జాబ్‌మేళాను ప్రారంభిస్తారన్నారు. సుమారు 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డి.హరిశేషు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవునికి ఘనంగా ఏకాదశి పూజలు



వేద సదస్యం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: సత్యదేవునికి చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా అర్చకులు మంగళవారం స్వామి, అమ్మవార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన, ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు తులసి దళార్చన నిర్వహించారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు వేయి నిర్వహించారు.

'వేదాంత' తీరుపై ఎస్.యానాంలో నిరసన



ఎస్.యానాంలో వేదాంత ప్లాంట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

- ప్లాంట్ కార్యకలాపాలను అడ్డుకున్న గ్రామస్తులు
- అధికారుల హామీతో తాత్కాలికంగా విరమణ

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వేదాంత రవ్వ ఆయిల్ ప్లాంట్ మూడు గేట్లను మూసివేసి మంగళవారం నిరసన తెలిపారు. ఉద్యోగులను ప్లాంట్ లోపలకు వెళ్లకుండా అడ్డుకుని ధర్నా నిర్వహించారు. గ్రామ ప్రజలపై వేదాంత అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గతంలో అనేక సందర్భాలలో హామీలు ఇచ్చి అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. దీంతో వేదాంత పర్యవేక్షణ అధికారి సతీష్ రెడ్డి.. ఆందోళనకారుల వద్దకు వచ్చి చర్చలు జరిపారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఆర్డీవో మాధవీలతో ఫోన్‌లో మాట్లాడి, ఈ నెల 25వ తేదీన అమలాపురం ఎమ్మెల్యే, కలెక్టర్ సమక్షంలో వేదాంత ఉన్నత స్థాయి అధికారుల సమక్షంలో గ్రామస్తులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగిన ఆందోళనను అధికారుల హామీ అనంతరం తాత్కాలికంగా విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి రాజేశ్వరి రాజా, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, పీడీఏయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, గ్రామ పెద్దలు దంగేటి చిట్టిబాబు, లంకే భీమరాజు, ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ల బుజ్జి పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణం వేగవంతం చేయాలి

- కలెక్టర్ మహేష్ కుమార్
- రోడ్ల పనులపై సమీక్ష

అమలాపురం రూరల్: ఇటీవల నిలిచిపోయిన జొన్నాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సృష్టి కాంట్రాక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. రిటైనింగ్ వాల్, అప్రోచ్ రోడ్లు, మడికి, బొబ్బిల్లంక, చెముడు లంక వద్ద సర్వీస్ రోడ్ల నిర్మాణంపై సమీక్షించారు. పాసర్లపూడి – మామిడికుదురు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులపై మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రిటైనింగ్ వాల్‌ను మట్టితో నింపుతూ పటిష్ట పరచాలని, దానికి సమాంతరంగా గడ్డర్ల కాస్టింగ్, అప్రోచ్ సర్వీస్ రోడ్లు నిర్మాణాలను చేపడుతూ ఒప్పందం మేరకు సెప్టెంబర్ నాటికి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పాసర్లపూడి – మామిడికుదురు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు, భూసేకరణ పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ రాజకుమారి, ఆర్డీవో కె.మాధవి, జాతీయ రహదారులు అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకులు సురేంద్రనాథ్, జాతీయ రహదారులు 216 సహాయ ఇంజినీర్ వెంకట రమణ, సృష్టి కాంట్రాక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టర్ రామకృష్ణ, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఏసుబాబు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను దరఖాస్తుదారుడు నూరు శాతం సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ రక్షణ, భూముల తొలగింపు, పీజీఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్, మూడు కేటగిరీలలో భూముల క్రమబద్ధీకరణ, నీటి తీరువా వసూలుపై రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి.. జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వంతులవారీ విధానాల ద్వారా రబీలో సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేస్తూ, నిర్దేశిత ఆయకట్టులో ఏ ఒక్క ఎకరం ఎండిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, ఆర్డీవో కె.మాధవి, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, డీటీ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల విజేతలకు మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్ఈ తదితరులు

క్రీడల్లో ప్రతిభ చాటాలి
క్రీడలపై ఆసక్తిని కనబరుస్తూ ప్రతిభను చాటాలని ఇంజినీర్లకు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. జిల్లా స్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు డీమ్స్ 2కె 25 పేరిట స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఆ విజేతలకు అమలాపురం మండలం నడిపూడి బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలులో బహుమతులు అందించారు. కలెక్టర్ మహేష్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ పీఆర్ఎస్ఈ రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అన్యంరాంబాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సహాయ ఇంజినీర్లుగా పదోన్నతి పొందడానికి డిప్లామా ఇంజినీర్స్ అసోసియేషన్ తరపున కృషి చేస్తానన్నారు. పీఆర్ డీఈఈ పీఎస్ రాజకుమార్, గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగం కార్యనిర్వాహక ఇంజినీరింగ్ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షుడు కాశే సురేష్, కార్యదర్శి సెలంరాజు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌సోపాలు!

- పనిచేయని కొత్త యాప్‌తో ఇసుక కష్టాలు
- ఎగుమతులు జరగక నిలిచిన వాహనాలు
- కొత్త డ్యూటీలు మాకొద్దు అంటున్న ఉద్యోగులు



తీపర్రులో నిలిచిన ఇసుక ఎగుమతులు

పెరవలి: ఇసుకాసురులకు ఇచ్చిన అవకాశాలు ఇచ్చినంత సేపు ఇచ్చి ఇప్పుడు కూటమి ప్రభుత్వం కఠిన నిర్ణయాలు అమలు చేయటంతో ఇసుక ఎగుమతులు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరుకు మైనింగ్ అధికారులు ఇసుక కోసం వచ్చే వాహనాలను ముందుగా ఫొటో తీసి, దాని ప్రకారం ఇసుక బుక్ చేసుకున్న రశీదును ముందుగా వీఆర్ఓ లాగిన్‌లోకి వెళ్లి... వచ్చిన సమయం నోట్ చేసిన తరువాత కాంట్రాక్టర్ లాగిన్‌కు వస్తోంది. ఆ తరువాత కాంట్రాక్టర్ ఇసుక లోడ్‌కి అనుమతి ఇచ్చి, లోడ్ అయిన తరువాత మళ్లీ దానిని ఫొటో తీసి పంపిన తరువాత ఉన్నతాధికారులు ఓకే చేశాక, రశీదు రాసి వాహనదారుడుకి ఇస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా పొరపాటున తప్పుగా నమోదు చేస్తే సైట్ మొత్తం ఆగిపోతుంది. మళ్లీ సైట్ ఓపెన్ అవ్వాలంటే మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి, అక్కడ నుంచి జిల్లా అధికారులకు, అక్కడ నుంచి అమరావతికి పంపించి జరిగిన తప్పు ఇది అని వీరందరికి చెప్పిన తరువాత దానిని సరిచేస్తే మళ్లీ సైట్ ఓపెన్ అవుతోంది. ఇదే క్రమంలో నిన్న ఆదివారం కాకరపర్రు ఇసుక ర్యాంప్, నేడు సోమవారం తీపర్రు ర్యాంప్‌లో ఇసుక ఎగుమతులు నిలిచిపోయాయి. కొత్త యాప్‌తో చాలా ఇబ్బందులు పడవలసి వస్తున్నదని దీనివలన ఎగుమతులు జరగక నానా పాట్లు పడుతున్నామని నిర్వాహకుల చెబుతుండగా, వాహనదారులు మాకు అసలు ట్రిప్‌లు పడటం లేదని, అన్ని సక్రమంగా ఉంటే యాప్ పనిచేయదని, యాప్ పనిచేస్తే ఇసుక ఉండటం లేదని అంటున్నారు. గతంలో రోజుకి మూడు ట్రిప్‌లు వేస్తే నాలుగు రోజులుగా కేవలం రెండు ట్రిప్‌లు మాత్రమే వేశామని చెప్పారు. దీంతో కిస్తీలు కట్టలేక, నానా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ప్రభుత్వం అంతా అయిపోయిన తరువాత ఈ విధమైన నిర్ణయాలు చేయటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీఆర్‌ఓలు మాత్రం మాకు ఈ డ్యూటీలు వద్దని కోరుతున్నారు. ఒక వీఆర్‌ఓ నేరుగా కలెక్టర్‌కు నాకు ఇంగ్లిషు రాదు, నేను యాప్‌లో నమోదు చేయలేకపోతున్నానని తెలియజేయగా.. జిల్లా అధికారులు సచివాలయ సిబ్బందిని కొత్తగా నియమించటంతో వారు గగ్గోలు పెడుతున్నారు. ఉచిత ఇసుక పథకం ప్రవేశపెట్టి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఉంది కానీ ఈ యాప్‌లు వలన ఎటువంటి ప్రయోజనం లేదని, దోచుకోవలసింది అంతా దోచేశారని ఇప్పుడు కొత్తగా నిబంధనలు తెచ్చి ఏమిటి ప్రయోజనం అని పలువురు అంటున్నారు. ఈ కొత్త యాప్ వలన ఎగుమతులు సక్రమంగా జరగక వాహనదారులు, ఇసుక వెళ్లక కాంట్రాక్టర్లు, కొత్త యాప్‌తో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.



తీపర్రు ఇసుక ర్యాంప్‌లో క్యూలో ఉన్న లారీలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,500
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

కల్యాణం.. రమణీయం




వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

- వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం
- వాడపల్లికి పోటెత్తిన భక్తులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి 7.30 గంటలకు వైభవంగా మొదలైంది. సర్వజగద్రక్షుడైన శ్రీవారు సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం , బుగ్గన చుక్కతో సిగ్గులొలుకుతున్న ఉభయ దేవేరులను పెండ్లాడారు. భక్తుల గోవింద నామ స్మరణ, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో వాడపల్లి క్షేత్రం అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవదాయ – ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం.విజయరాజు, డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా సాగాయి.

ప్రత్యేక మంటపంలో..

వాడపల్లి క్షేత్రంలోని విశాలమైన ప్రదేశంలో పంచ ద్రవ్యాలు, సుగంధ పరిమళాలు, సువాసనలు వెదజల్లే పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మంటపంలో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో బంగారు, వెండి ఆభరణాలతో సుందరంగా అలంకరించి పల్లకీల్లో ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వేద మంత్రోచ్చారణ, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో శ్రీవారు, అమ్మవార్లను కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. కళ్యాణ వేదికపై కల్యాణ మూర్తులను ఆశీనులు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంద్ర మండలం నడిపూడికి చెందిన వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, వేదపండితులు, అర్చక బృందం కల్యాణ తంతును నిర్వహించారు. దేవస్థానం తరపున శ్రీవారికి ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు, ఆర్డీఓ పి.శ్రీకర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మండపేటకు చెందిన రామారెడ్డి – మహాలక్ష్మి దంపతులు శంఖు, చక్ర, నామాలతో అలంకరించిన కొబ్బరి బొండాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డీసీ అండ్ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా మధ్యాహ్నం మూడు గంటలకు స్వామివారి రథోత్సవాన్ని మాడ వీధుల్లో కన్నుల పండువగా నిర్వహించారు.

పిడుగు పడి రైతు మృతి

నల్లజర్ల: పిడుగు పడి రైతు మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడెంలో వెలగాని సత్యనారాయణ (47) తన ఇంటి సమీపంలోని మామిడి చెట్టు వద్ద ఉన్న సిమెంట్ బెంచీపై కూర్చున్నాడు. ఈదురుగాలులతో వర్షం పడుతున్న ఆ సమయంలో పిడుగు పడడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడు నబీపేట నుంచి వచ్చి ఇక్కడి ఎంపీపీ స్కూలు వద్ద ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు.

వివాహిత మౌన దీక్ష



రాజుపాలెంలో అత్తారింటి వద్ద మౌన దీక్షకు దిగిన వివాహిత

కిర్లంపూడి: తన కుమారుడికి రావాల్సిన ఆస్తిని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ రాజుపాలెంలోని తన అత్తారింటి వద్ద నాగ వెంకట లక్ష్మి అనే వివాహిత తన కుమారుడు, కుటుంబ సభ్యులతో మంగళవారం మౌన దీక్షకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామానికి చెందిన నాగ వెంకటలక్ష్మికి కొత్తపల్లి మండలం గోర్సకు చెందిన వీరబాబుతో పెద్దల సమక్షంలో వివాహమైంది. కొన్నేళ్ల తరువాత రాజుపాలెంలో వారు స్థిరపడ్డారు. అయితే వీరబాబు మానసిక స్థితి సరిగ్గా ఉండదు. కానీ ఈ విషయం చెప్పకుండానే వివాహం చేశారు. వారికి మగబిడ్డ పుట్టిన తర్వాత ఆమెను అత్తింటివారు దూరం పెట్టారు. కుమారుడికి రావాల్సిన ఆస్తిని వేరే వాళ్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడంతో పాటు ఇదేంటి అని అడిగితే ఇంట్లోకి కూడా రానివ్వకుండా బయటకు వెళ్లగొడుతున్నారు. దీంతో నాగ వెంకటలక్ష్మి తన కుమారుడితో కలిసి దీక్ష చేపట్టింది.

క్లుప్తంగా

పంజాబ్‌లో వాడపల్లి యువకుడి మృతి


- మృతుడు వైఎస్సార్ సీపీ నేత సముద్రం కుమారుడు
- స్వగ్రామంలో అంత్యక్రియలు



నాగ వెంకట యశ్వంత్ (ఫైల్)

కొవ్వూరు: పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో గల లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న వాడపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, ఉప సర్పంచ్ లంకదాసు సముద్రం పెద్ద కుమారుడు నాగ వెంకట యశ్వంత్ (23) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. అమృత్‌సర్‌లో ఓ పరీక్ష రాసేందుకు ఈ నెల 6వ తేదీన తన స్నేహితుడి కలిసి మోటారుసైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా కుపర్తల సమీపంలో హైవేపై డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో యశ్వంత్‌తో పాటు అతడి స్నేహితుడు, విజయనగరానికి చెందిన గానా సిద్విక్ వర్మ (23) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అమృతసర్ నుంచి ఢిల్లీ తీసుకెళ్లి, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో మంగళవారం మధ్యాహ్నం యశ్వంత్ స్వగ్రామమైన వాడపల్లి తీసుకొచ్చారు. వాడపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న యశ్వంత్ ఇటీవల క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యారు. మద్రాసులో ఉద్యోగం కుడా వచ్చింది. ఈ వారంలోనే ఉద్యోగంలో చేరనున్న సమయంలో మృత్యువాత పడడాన్ని కుటుంబ సభ్యులు తట్టుకోలేక పోతున్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు), మాజీ ఏఎంసీ చైర్మన్ బూరుగుపల్లి వీర్రాఘవులు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

ఎట్టకేలకు పారిశుధ్య నిర్వహణ టెండర్ విడుదల



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంతో సహా రాష్ట్రంలోని ఏడు దేవస్థానాలలో శానిటరీ మెటీరియల్‌తో సహా క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజడ్ టెండర్ ప్రకటన మంగళవారం విడుదలైంది. రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ ప్రొక్యూర్ టెండర్ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ దేవస్థానానికి ఆ దేవస్థానం శానిటరీ టెండర్లు పిలిచి ఖరారు చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని దాదాపు ఆరు నెలలు ఆలస్యం చేశారు. గత అక్టోబర్‌లో విడుదల కావల్సిన టెండర్ ఆరునెలలు ఆలస్యం వచ్చింది. టెండర్లు దాఖలుకు అభ్యర్థన తేదీ ఈ నెల 16, ప్రీబిడ్ సమావేశం ఈ నెల 17న, టెండర్ దాఖలుకు చివరి తేదీ మే ఒకటి, మే ఐదున టెండర్ టెక్నికల్ బిడ్ తెరుస్తారు. మే 12న ఖరారు చేస్తారు. జూన్ ఒకటి నుంచి కొత్త కాంట్రాక్ట్ ప్రారంభమవుతుంది. కాగా.. చెత్త ట్రాక్టర్ కాంట్రాక్టును టెండర్ పిలవకుండా నెలకు రూ.60 వేలకు అప్పగించడంతో సాక్షిలో వార్త వచ్చిన విషయం తెలిసిందే. దీంతో టెండర్లు పిలిచి, అతి తక్కువకు దాఖలైన రూ.23,990కు ఖరారు చేశారు. దీంతో దేవస్థానానికి నెలకు రూ.30,010 ఆదా అయ్యింది.

ప్రతి రైతు పారిశ్రామికవేత్తగా ఎదగాలి

- నిర్కా డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్
- ఉత్సాహంగా 'ఆవిష్కర్తల కలయిక'



సావనీర్‌ను విడుదల చేస్తున్న శేషుమాధవ్, రవిశంకర్, తారా సత్యవతి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి రైతూ పారిశ్రామికవేత్తగా ఎదగాలని, వ్యవసాయాన్ని పరిశ్రమగా చేపట్టాలని జాతీయ వాణిజ్య పరిశోధన, వ్యవసాయ పరిశోధన సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. రాజమహేంద్రవరం ఐసీఏఆర్ – నిర్కా (సీటీఆర్ఐ)లో మంగళవారం వ్యవసాయంలో ఆవిష్కరణలు – వ్యవసాయం పారిశ్రామికరణ దిశగా ఆవిష్కర్తల కలయిక కార్యక్రమం జరిగింది. అధ్యక్షత వహించిన శేషుమాధవ్ మాట్లాడుతూ వ్యవసాయంలో వాణిజ్యపరమైన వినూత్న ఆవిష్కరణలు, అవకాశాలతో పాటు వాణిజ్య పంటల ఉత్పత్తుల దిగుమతులను తగ్గించుకునే దిశగా రైతులు, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు కృషి చేయాలన్నారు. న్యూఢిల్లీ ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఐపీటీఎం) డాక్టర్ నీరు భూషణ్ ముఖ్యఅతిథిగా ఆన్‌లైన్‌లో హాజరు కాగా, వారి తరఫున న్యూఢిల్లీ ఐసీఏఆర్ – ఐటీఎంయూ డాక్టర్ వి.విక్రమ్‌సింగ్ ఆన్‌లైన్‌లో సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఐటీఎంయూ నోడల్ ఆఫీసర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హెచ్.రవిశంకర్ మాట్లాడుతూ ఆవిష్కర్తల కలయిక ఆవశ్యకతలను వివరించారు. వాణజ్య వ్యవసాయంపై ఆవిష్కరణలు, విలువ ఆధారిత పదార్థాల తయారీపై రైతుల విజయ గాథలు, కోత అనంతరం వాణిజ్య పంటలలో వివిధ ఉత్పత్తులలో సంకలనం చేయబడిన సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, హైదరాబాద్ ఐసీఏఆర్–నారమ్ మేనేజ్మెంట్ డివిజన్ ఎడ్యుకేషన్ సిస్టమ్స్ హెడ్ ఎస్.సెంథిల్ వినాయగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నటరాజ్, నాబార్డు ఏజీఎం సోము నాయుడు, ఎపెడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్‌పీ నాయుడు మాట్లాడారు. అనంతరం 11 మంది ఔత్సాహిక యువత తమ అనుభవాలను వివరించారు. 11 ఎగ్జిబిషన్ స్టాళ్లలో పసుపు, అశ్వగంధం, ఆముదం, మిరప ఉత్పత్తులతో పాటు ఎన్‌జీవో, ఎఫ్‌పీవోలు, ఏపీసీఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) వారి వివిధ ఉత్పత్తులు, రోబోటిక్స్, డ్రోన్స్, జ్యూట్‌బ్యాగులను ప్రదర్శించారు. అనంతరం 17 మంది ఔత్సాహిక ఆవిష్కర్తలను సత్కరించారు.

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగిని మృతి



నెల్లి కరుణ మృతదేహం

నిడదవోలు: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నెల్లి కరుణ (28) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. నిడదవోలు రూరల్ ఎస్సై కె.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన నెల్లి వెంకట రమణ, సూర్యకుమారి దంపతులకు ఏకైక కుమార్తె కరుణ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వార్డు సచివాలయ కార్యదర్శిగా ఉద్యోగం సాధించింది. సోమవారం సాయంత్రం విధులను ముగించుకుని కోరుమామిడి గ్రామంలోని ఇంటికి వెళ్లింది. అనంతరం బంధువులతో కలిసి చర్చిలో ప్రార్థన చేసింది. చర్చి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కడుపునొప్పి, కళ్లు తిరగడం, కాళ్లూ చేతులు వంకర్లు తిరగడం వంటి సమస్యలతో బాధపడుతున్న కరుణను బంధువులు పద్మ, సుబ్బు కలిసి కారులో నిడదవోలు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న కరుణను రాత్రి 9 గంటల సమయంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కరుణను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గదిలో ఉంచారు. బంధువులు, తల్లిదండ్రులు మాత్రం ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కరుణకు పెళ్లి చేసేందుకు సంబంధాలు కూడా చూశారు. అయితే వివాహం విషయంలో కుటుంబంలో కలహాలు జరుగుతున్నట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. కరుణ మరణ సమాచారం తెలుసుకున్న పట్టణంలోని వివిధ వార్డు సచివాలయ ఉద్యోగులు ఆసుపత్రికి తరలివచ్చారు. మృతురాలి కరుణ తల్లి సూర్యకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.వీరబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని కరుణ మృతదేహాన్ని పరిశీలించి సంతాపం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ సంతాపం తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



వాహనం, నిందితుడితో డిప్యూటీ తహసీల్దార్

రాజానగరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. జాతీయ రహదారిపై జీఎస్ఎస్ వైద్య కళాశాల సమీపంలో సోమవారం రూ.10 లక్షల విలువైన బియ్యం పట్టుబడిన సంగతి తెలిసిందే. ఇదే విధంగా మంగళవారం కూడా పైప్రాంతానికి కొద్దిదూరంలో పిరమిడ్‌ను చేర్చి ఉన్న పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై రూ.ఒక లక్ష విలువ చేసే రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని డిప్యూటీ తహసీల్దార్ (పౌరసరఫరాలు) గొలుగూరి బాపిరాజు తెలిపారు. చక్రద్వారబంధానికి చెందిన మాడబోయిన గోపి నుంచి వడిశలేరుకు చెందిన వట్టికూటి మణికంఠ మినీ వ్యాన్‌ను అద్దెకు తీసుకుని, అనపర్తి నుంచి గండేపల్లికి ఈ బియ్యాన్ని రవాణా చేస్తున్నాడన్నారు. నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

అట్టనాణేలతో లెక్కల పాఠాలు



కృష్ణ కామేశ్వర్ సేకరించిన అలనాటి ఎనిమిది రకాల అట్టనాణేలు

- 110 ఏళ్ల క్రితం చలామణి
- సేకరించిన కృష్ణ కామేశ్వర్

అమలాపురం టౌన్: బ్రిటీషు కాలంలో దాదాపు 110 ఏళ్లనాటి ఎనిమిది రకాల అట్ట నాణేలను అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. కాలగర్భంలో కలిసి మరుగున పడిపోయిన ఈ నాణేలు అప్పట్లో అర్ధ రూపాయి, పావలా, బేడా (రెండు అణాలు), అణా, అర్థణా, కాణీ, దమ్మిడి అనే ఎనిమిది రకలుగా చెలామణిలో ఉండేవి. అప్పట్లో ఈ నాణేలను పిల్లలకు లెక్కలు నేర్పడానికి ఉపయోగించేవారని సేకరణ కర్త కృష్ణ కామేశ్వర్ తెలిపారు. అసలైన నాణేలు పిల్లలకు ఇస్తే అవిపోతే అనివార్యమయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టకుని వీటిని అట్టతో తయారు చేయించారు. వెండి రంగు, రాగి రంగుతో ఉండే ఈ అట్టనాణేలకు, అసలైన నాణేలకు వ్యత్యాసాన్ని ఎంతో పరీక్షించి చూస్తే తప్ప తెలియదు. ఈ నాణేలను బ్రిటీషు వారు జర్మనీ దేశానికి చెందిన లాంగ్ మన్స్ అనే కంపెనీ ద్వారా తయారు చేయించి మన దేశానికి రప్పించి ఇక్కడ విద్యార్థులకు లెక్కలు నేర్పేవారు. అయితే ఈ పద్ధతి ఎక్కువ కాలం నడవకపోవడంతో ఈ అట్టనాణేలు క్రమేణా అదృశ్యమయ్యాయి. అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన నడింపల్లి రామరాజు 50 ఏళ్ల కిందట అనేక పాఠశాలలను సందర్శించి తిరిగి అట్టనాణేలను సేకరించారు. ఆయన నుంచి తాను సేకరించినట్లు కృష్ణ కామేశ్వర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ధవళేశ్వరం: పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ధవళేశ్వరం కాటన్‌పేటలో భవన నిర్మాణ కూలీ షేక్ బుజ్జి (45) మృతి చెందారు. ధవళేశ్వరం పోలీసుల వివరాల మేరకు.. కాటన్‌పేటలో శివానంద స్కూల్ పక్కన మహ్మద్ షరీఫ్ హుస్సేన్‌కు చెందిన భవనం నిర్మాణం జరుగుతోంది. మంగళవారం కొంతమూరుకు చెందిన షేక్ బషీర్‌బాబుతో కలిసి షేక్ బుజ్జి తాపీ పనికి వచ్చాడు. ఇంటి పిల్లర్ వద్ద బైండింగ్ వైర్ కడుతుండగా, ఆపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగ తగలడంతో.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అదుపుతప్పి భవనం పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య షేక్ బీబీజాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ మోటార్ల చోరీ

అల్లవరం: గోడి రెవెన్యూ పరిధి రెల్లుగడ్డ సరిహద్దు ప్రాంతంలోని ఆక్వా చెరువుల వద్ద సోమవారం రాత్రి 14 విద్యుత్ మోటార్లను చోరీ చేశారని ఆక్వా రైతు నడింపల్లి వెంకట సూర్యనారాయణరాజు మంగళవారం అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2 హెచ్‌పీ మోటార్లు 14, 1 హెచ్‌పీ మోటార్లు 2 కలిపి మొత్తం 16 మోటార్లు చోరీ చేశారని తెలిపారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యానాం - ద్వారపూడి రహదారిలో ఉప్పుమిల్లి - కుయ్యేరుల మధ్య రోడ్డుకిరువైపులా ఉన్న పచ్చని చెట్లు

ట్రీనరీ!

ఎడారిలో ఆముదపు మొక్క అయినా మహావృక్షమే అంటారు. మండువేసవిలో నడినెత్తిన సూరీడు చుర్రుమనిపిస్తుంటే కాస్తంత నీడదొరికితే చాలనుకుంటారు ప్రయాణికులు. యానాం – ద్వారపూడి రహదారిలో కాజులూరు మండలం ఉప్పుమిల్లి నుంచి కుయ్యేరు వరకు కిలోమీటరు పొడవునా రోడ్డుకిరువైపులా ఉన్న పచ్చనిచెట్లు వాహన చోదకులకు ఆహ్లాదాన్ని పంచుతూ, పాదచారులకు ఆశ్రయమిస్తున్నాయి. ప్రకృతి చేకూర్చిన అందమైన ఆర్చిలా పచ్చని చెట్లు రోడ్డుపై ఎండ నుంచి గొడుగు పడుతుంటే ఈ రహదారిలో ప్రయాణించేవారు కొంతసేపు చెట్లనీడన ఆగి వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. పంట పొలాల మీదుగా వచ్చే చల్లగాలులను చెట్లు నీడన కూర్చుని ఆస్వాదిస్తున్నారు.

– కాజులూరు